## సరోజ

### జ్వరం

మూడు దినాలదో, మూడు వారాలదో.

దానికి శరీరం మీద సంపూర్ణాధికారం సంక్రమించాక.

నీ మనసు, బుద్ధి, మెదడు, నరాలు దాని బానిసలై పోయాక.

అది నీ చేతనను ఒక అవిశ్రాంత అంతరంగ తరంగ నీలవాహినిగా మార్చివేశాక.

కాల నిర్ణయం కష్టసాధ్యం.

తాప నిర్ణయమూ సాధ్యం కాదు.

నిజానికి మొదటి రోజున కళ్ళు మూతలు పడుతున్నా తూలిపోయి మంచం మీద పడిపోయినా, ధర్మామీటర్ కోసం చేతులు చాచి బల్లమీద వెతికాడు. వేళ్ళకు రంగుల ట్యూబులు, రంగులు కలిపే పాలెట్ పళ్ళెం మాత్రమే తగిలాయి. ధర్మామీటరు తన ఫిడేల్ పెట్టెలో దాగి ఉందని స్మృతికి రాలేదు. రాకపోగా ఏదో తరంగ బలం మళ్ళీ వరద నీటిలోకి తోసేసింది.

బాగుంది. రాగాలు పలికించే ఫిడేలుతో, రోగ తీవ్రతను గుర్తించే జ్వర తాపమానం - ధర్మామీటరు జోడీ.

సముద్ర తరంగాలకు ఒక లయ, ఘోష.

ఈ ప్రవాహంలో అవి మృగ్యం. అయినా జ్వరం తన ప్రేయసి, ప్రియురాలు. చిన్నతనంలో ఆరెవై దినాల పారా టైఫాయిడ్ అనబడే సన్ని పాత రోగం ఆయుర్వేదాచార్య పోగుల లక్ష్మయ్య గరళంపోసి బతికించాడు.

యుద్ధంలో మలయా అడవుల్లో రక్తం పీల్చిన జలగలు. నెత్తురు తాగే దోమలు. మలేరియా - ధర్మామీటరును బద్దలు చేసే జ్వరం.

క్వినైన్.

క్వినైన్.

తను కొట్టుకు పోతున్నది ఏరా? సముద్రమా? వాటికి పేర్లు లేవు. అరాచకం. రష్యా వాళ్ళు - నిహిలిజం అంటారు. తను సైన్యంలో చేరినప్పుడు - ఇంకా జీపులు పుట్టలేదు. ఒన్ హండ్రెడ్ వెయిట్ ట్రక్కులు. ఏమిటో ఆ పేరు? బురదలో కూరుకుంటే అంతే సంగతి. జపాను వాడి విమానాల్ని శబ్దాన్ని బట్టి గ్రహించవలసిందే - తీరా సమీపించి బాంబులు వర్షించిం తర్వాత. రాడార్లూ పుట్టలేదు. పెన్సిలిన్ ఇంకా రాలేడు. పార్థసారథి-కెప్టెన్ సారో - న్యుమోనియాతో చచ్చి బతికాడు.

ఎట్లా?

కేవలం విష్ణు సహస్రనామ జపంతో. వాడిల్లు మద్రాసు తిరువళ్ళిక్కేణి పార్థసారధి కోవెల సమీపంలోనే గదా. వాడికి పెన్సిలిన్ అంటే నమ్మకం లేదు.

మళ్ళీ ఇంకో లోకం. జ్వర భాషలో జపానీ మాటలు. మాటలు కావు. మృత్యు ఘోషలు. జపాన్ సిపాయి బాయినెట్. కెప్టెన్ సారోకు తొంటిలో పోటు. తనూ, గూర్ఖా రెజిమెంట్ సిపాయి రణ బహదూర్-కెప్టెన్ సారోనుపట్టి మోసుకుంటూ, వంగుతూ, నక్కుతూ పోతుంటే తన తొడలో మర తుపాకీ గుండు. రణబహదూర్ యిద్దర్నీ పడిపిస్తుంటే - జై భవానీ - ఛత్రపతి శివాజీ మహారాజ్‌కీ జై - యుద్ధ నినాదాలు. తమ వాళ్ళు. గూర్ఖాలు, సిక్కులు, డోగ్రాలు మరాఠాలు. సింగపూర్‌లో "అరిభయంకరమైన" ఆంగ్లేయ నౌకా దళం హార్బర్ బయట రాక్షస కళేబరాలుగా పడిపోయి, చివరి స్టీమరులో తనూ, సారోపునర్జన్మ ఎత్తటం. తను జపాను వాడి గుండె మీద బలంగా తన్ని ఎసాల్ట్ రైఫిల్‌ను తుప్పల్లో విసిరివేసినందుకు - మెన్షన్డ్ ఇన్ డిస్పాచెస్. యుద్ధ చరిత్రలో తన పేరు. కుంటి వాడైనందుకు - డీమోబ్ - సైన్యం నుండి విముక్తి. మాజీ కెప్టెన్ హయగ్రీవ్. వార్ ఆర్టిష్ట్. యుద్ధ చిత్రకారుడు.

జ్వర భాష ఇంకో దేశం ప్రవేశించింది. ( గ్రీవ్ అంటే చింత గదా ) కెప్టెన్ సారో స్థిత ప్రజ్ఞుడు. మళ్ళీ యుద్ధంలోకి వెళ్ళాడు. తన కుల దైవంతో పాటు లండన్‌లో విజయ విన్యాసాల్లో పాల్గొన్నాడు. వి.జె.డే! విక్టరీ ఓవర్ జపాన్. చివరకు తను ద్వేషించే ఫాసిస్టు దేశపు ఇటాలియన్ కన్యను పెళ్ళాడాడు. అక్కడే స్థిరంగా ఉన్నాడు. కెప్టెన్ పార్థసారధి, అర్.ఇ (రాయల్ ఇంజనీర్స్) ఇప్పుడు ఇటాలియన్ కన్సల్టింగ్ ఇంజనీర్. ఏ జన్మలోనే తన తమ్ముడు. తన ట్రిప్లికేన్ మేడపై భాగం మూడు గదులూ కెప్టెన్ గ్రీవ్‌కు ఇచ్చేశాడు. అద్దె లేదు. కింద భాగాల్లోని అలజడి లేదు. సీనియారిటీ ప్రకారం పంపు కింద నీళ్ళు పట్టుకొనే వంతులు లేవు. సిగిరెట్టు కాలిస్తే శ్రీరంగ నాధుడికి అపచారం జరిగినంత ఆందోళన లేదు. స్నేహితులొస్తే తొంగి చూసే చికాకు లేదు. తనూ, తన రంగులూ, చిత్ర పటాలూ, కాన్వాసులు, ఈజెల్ స్టాండ్‌లూ, కుంచెలూ, కిటికీ గుండా సముద్ర దృశ్యం. మధ్యాహ్నం బంగాళాఖాతం గాలి.

* * *

గాలి విసురుగా వచ్చి కిటికీ రెక్కలు కొట్టుమిట్టాడుతున్నా హయగ్రీవానికి తెలివి రాలేదు. కాని శరీరం మీద అప్పుడే పట్టిన స్వేదం ఆరిపోతున్నది. స్వేదంతో తడిసి మగ్గిన గుడ్డలు - కుళ్ళు వాసన. రెండు పిల్లులు కొట్లాడు కొంటూ, ద్వంద్వ యుద్ధం చేస్తూ కిటికీ గుండా లోనికి దూకి కొయ్య ఫ్రేము మీద పడ్డాయి గాబోలు - ఈజెల్ స్టాండు ధన్‌మని పడిపోయింది. మాగన్నుగా కళ్ళు తెరిచి తన జ్వర గంధాన్ని తనే భరించలేక తిరిగి నీలి వర్ణపు నదీ ప్రవాహంలోకి పడిపోయాడు.

యుద్ధపు గాయం నయమై పోయి సంవత్సరాలైనా సలుపు పెట్టటం మానదు. కాలు కదిలించి కుడి పార్శ్వానికి తిరిగి పోయాడు. ఓరగా కళ్ళు తెరిచినపుడు చిందరవందరగా గది నిండా సిగిరెట్టు పీకలు, పుస్తకాలు. మళ్ళీ వ్యక్తా వ్యక్త ఘటనల శృంఖలికలో మగత. ఈ పుస్తకాలన్నీ ఏమిటి? తనే ఒక బుక్ ఆఫ్ డౌట్ అండ్ సారో- సంశయ విషాద కావ్యంలాగా బతుకు. నీడల రాజ్యం ఇది. రెండు గొంతులా సంబోధించేవి తను గీచిన బొమ్మలు. ఇక్కడ దేవతల కన్నా దయ్యాలదే బలం.

ఈ చిత్ర లేఖనంలో తన భవిష్యత్ నిజమేనా?

తన రంగుల్లో, రంగుల మిశ్రమాల్లో సహజ గంభీరత ఉందా?

ఈ చిత్రాలు మౌన సంగీత రాగాల్ని వినిపిస్తున్నవా?

వాటి నిశ్శబ్దంలో ఆనందం, ఆవేదన గోచరించవేమి?

ఫిడేలు కమానులాగా, రంగుల కుంచెలు ఫిడేలు రాగాలు ప్రతిధ్వనించకపోయినా కనీసం వినిపిస్తున్నాయా?

తనను సందేహ వీచికలు చుట్టుముట్టినప్పుడు, తన మీద తన విశ్వాసం వివర్ణమైనపుడు, తన కాలి కుంటితనం తన మనస్సును ఆక్రమిస్తున్నదని తోచినపుడు, తనను ఈ బ్రతుకు ఒక శవ పేటికలో కుక్కుతున్నదని నిర్వేదం కమ్మినపుడు, తన మిత్రులు పెదవి విరిచి తన బొమ్మల్ని రెండవ సారి చూడనపుడు, తన పలుకులు సమాధి చీకటినుంచి వినిపిస్తున్నట్లు భ్రమించినపుడు, తన దారిద్ర్యాన్ని చిత్రకారుడి వృత్తి ప్రవృత్తుల్నీ, తన భార్య నిరసించి అవమానపు మాటల్తో విడాకులు కోరి దూరమైనపుడు, యుద్ధం సర్వీసు బలంతో తనను గవేషిస్తూ వచ్చిన ఉన్నతోద్యోగంలో యిమడలేక, సిరిని కాలదన్ని పశ్చాత్తాపాగ్నిలో కాలుతూన్నపుడు - కమాను పట్టి ఫిడేలు తంత్రుల మీద తనను తను అన్వేషించుకొని, ఆ అన్వేషణ పొగమంచు వెనక స్పష్టా స్పష్టమైన విధి రూపం తనకు అర్థం కాక విలపించినపుడు - జ్వరం ప్రియురాలి వలె తన్నాదరించేది.

అక్కతోపాటు చిన్నతనంలో తను ఫిడేలును వరించాడు. తను కోరిన వెప్పుడూ దొరకలేదు. తనకు దొరికిన వాటిని తనెప్పుడూ కోరలేదు. ఈ ఫిడేలూ, ఈ కుంచెలూ తను కోరినవి. తనకు లభించినవి. గాఢ వేదన మనసును ముద్రాంకితం చేసిన క్షణాల్లో, బాధాపూర్ణితమై హృదయం బరువెక్కిన సమయాల్లో - తను శరణుజొచ్చేది జ్వరాన్ని. జ్వరం తనను అంతర్ముఖుణ్ణిగా మారుస్తుంది. ధూళి ధూసర కలుషితమైన బాటల నుండి తనను మరలిస్తుంది. ఏకాంతాలయ నిశ్శబ్ద సంపుటాల్లో తనకు జోలపాడుతుంది.

జయ జయహో జ్వర దేవతా!

రా! రా! ఏ తెంచినావా?

నీ వినీల కుటిల కుంతలాలతో నన్ను కప్పి కరుణించు దేవీ!

* * *

నిజంగానే. ఈ శాంతాంధకారంలో గూడా ఎవరి వినీల కుటిల కుంతలాల మృదు మధుర సువాసనో. శీతల పానీయంతో తన ముఖం తుడుస్తున్నారు. తన శిరోజాలని సవరించి సర్దుతున్నారు. తనను పొర్లించి వీపునంతా

యుడికొలోన్ సుగంధ జలంతో శుభ్రం చేస్తున్నారు. తన చొక్కాను వదులు చేసి తీస్తున్నారు. తన రుద్రరమ్య నిశీధం అంతమవుతున్నది. తన ఫిడేలు మధుర గీత మాలల లాగా మృదుల పాదాలతో గదినీ, మురికినీ ఎవరో శుచీ జలంతో కడుగుతున్నారు. ఉషోదయం అవుతున్నదా? హయగ్రీవం కళ్ళు తెరిచాడు. నీరసంతోనే లేచి కూచున్నాడు.

ఎదురుగా సరోజ శాపగ్రస్తురాలైన అప్సరసలాగా - దీనంగా - ఆందోళనతో.

"లేవండి. పక్క శుభ్రం చేస్తాను. ఎన్నాళ్ళనుంచి జ్వరం? అయ్యో - ఎంత శుష్కించి పోయారు?"

చంక కింద చేయి జొనిపి లేవదీసింది. కుర్చీలో పసివాణ్ణి దిగవిడిచి నట్లు కూచో బెట్టింది. క్షణంలో పక్క గుడ్డలు ముద్దకట్టి ఆవలికి విసిరేసి చలవ దుప్పటి పరిచింది. కొళాయి నీళ్ళు గ్లాసుతో తాగించింది.

సరోజ తన మోడల్. దిన వేతనానికి నగ్నంగానో, నిండుగానో తన చిత్ర లేఖనానికి ప్రతీకగా నిలిచే మట్టి బొమ్మ. మృత్పిండం. తన ఊహలకు, తాత్విక దర్శనానికి, రంగు కుంచెల సంగీతానికి ఒక మనుష్య రూపం. ఈ ప్రతిమకు ప్రాణదానం చేస్తేనే ఒక చిత్ర పటం. పెయింటింగ్. పార్థసారధికి తను పంపిన మోడరన్ పెయింటింగ్స్ అనే పాశ్చాత్యానుకరణాల బొమ్మల ఫోటోలకు జవాబు వచ్చిన దినం అది. "ఇటువంటి చిత్రాలు గీచే వాళ్ళు ఇటలీలో వందల మంది, ఫ్రెంచి దేశంలో వేలమంది ఉన్నారు. ఆకలితో ఉన్నారు. తమ నీడను తామే వెతుక్కొనే నిర్భాగ్యులు, నైపుణ్యం అరాచక మైతే, నీకు సంగీతం ఏదో, అనుభూతి ఏదో సుగోచరం కాకపోతే - యీ అబ్‌స్ట్రాక్టు - అవ్యక్త చిత్రాలు పుట్టుకొస్తాయి. నువ్వు పుట్టిన నేల, నీ వాళ్ళ ఆత్మ, నీ గురువుల పరంపరానుభూతినుండి వేళ్లూరిన ఆత్మ ప్రబోధం, నీవు చూచిన గుళ్ళు, గోపురాలు, పశు సంపద, దైన్యం, ధీరత్వం - ఎక్కడా కనబడవేం? నీలోకి, లోతులకు తరలిపో. నీ రంగుల మిశ్రమం అద్భుతంగా ఉండవచ్చునని ఇక్కడి నిపుణులు చెబుతున్నారు. కావలసింది - నీ స్వతంత్ర వైయక్తిక ముద్ర. సిద్ధాంతాల భావ జాలం కాదు. తాత్విక భూమిక" అని రాశాడు.

తన దివాస్వప్నాల ధీరత సడలి, దీనుడై, ఖిన్నుడై - మిత్రులు భాస్కరం, శ్రీను వాళ్ళ స్టూడియోకి వెళ్ళి మౌనంగా కూర్చొన్నాడు. శ్రీను పాత

జమీందారు గారి వారసుడు. పారిస్ స్టూడియోలా తన గదిని అమర్చుకో గలిగినవాడు. వాళ్ళు ఢిల్లీలో తమ చిత్రాల ప్రదర్శన హడావుడిలో ఉన్నారు. అక్కడ తన నూతనాందోళనల ప్రథమ ప్రతి శృతిగా కన్పించింది సరోజ.

విరాటుడి కొలువులో సైరంధ్రి.

అశోక వృక్షం నీడలో సీతాదేవి.

వయసు తెలియజెప్పని ముఖం.

ఇరవై? పాతిక?

ముప్పై?

తనను రంగుల్ని విసర్జించి ఉద్యోగ ప్రయత్నం చేయాలనుకొన్న తీవ్ర నిరాశా పథం నుండి మళ్ళించింది ఆమె వదనమే. అంత దైన్యంలో బ్రతుకు స్వప్నాలకు వేరేవో జీవధారలు నిశ్చితంగా ఉన్నాయని ప్రబోధించిన ఆ చూపులు. కుంటి వాడికి కుంచె, కమాను ఆత్మీయులని తెలుసుకొన్న జ్ఞానోదయంతో, ఆమెను నిరాశ్రయను చేయకుండా తన చిరునామా ఇచ్చాడు. రెండు బొమ్మలు గీచాడు. దిన వేతనం పదిహేను రూపాయలు. సరోజ మొదటి సారి వచ్చిన దినానా తనకు జ్వరమే. నగ్న రూపం చిత్రించబోయి, పార్శ్వపు దిశగా కూర్చోమని చెప్పినపుడు, ఆమె వీపు మీది వాతలు. 'భర్త కొట్టిన దెబ్బల'ని విలపిస్తూ చెప్పింది. తను అబ్కారీ జవాను కూతురు. ఇంకో అబ్కారీ వాడితో వివాహం. తాగుబోతై ఉద్యోగం పోగొట్టుకొని భార్య సంపాదన మీద బతుకుతున్నాడు.

''బిడ్డలు?''

సరోజ సమాధానం చెప్పలేదు.

దొడ్డ బుద్ధితో భాస్కరం, శ్రీను తన బొమ్మల్ని రెంటిని ఢిల్లీ ప్రదర్శనకు తీసుకుపోయి నెల రోజుల తర్వాత కొంత డబ్బుపంపారు. నిజంగా తన బొమ్మలు అమ్ముడుపోయాయో లేదో తెలీదు. ఆ డబ్బుతో తను యాత్రలకు పయనం. పార్థసారథి సూచించిన ఆత్మ సాక్షాత్కారాన్వేషణ. ఎక్కడ లభిస్తుందో అగమ్యం. పిచ్చివాడు విసిరిన రాయి ఈ బ్రతుకు. ఈ యాత్ర లోనే అక్కయ్య వాళ్ళ గ్రామానికి వెళ్లాడు. తన చదువు ఖర్చుల గురించి - బావ అక్కయ్యతో వివాదం పడగా తను విని, కాలేజి మానివేసి యుద్ధ పటాలాల్లో చేరకముందు - ఎన్నేళ్ళక్రితమో ఈ అక్కను చూసింది. ఆమె కన్నీళ్ళ నిశ్శబ్దవాహినిని చూడలేక పాదాలను కళ్ళకద్దుకొని బయలుదేరి

వస్తూంటే, నాన్న చదివే 'వివేకానంద చరిత్ర' పుస్తకం తనకిచ్చింది. అందులో ఉన్న డబ్బు కాగితం కవర్ను ఇంటికెళ్ళాకనే చూసింది.

పార్థసారధి తండ్రి తెలుగు జిల్లాల్లో జడ్జి పని చేస్తూన్నప్పట్నించీ తనకూ వాడికీ స్నేహం. వాడిది రాజకీయ అవగాహన. తనది అన్నోపార్జన అవసరం. ఇద్దరూ సైన్యంలో చేరారు. 'వివేకానంద చరిత్ర' చదివాక తనకు దృగ్గోచరమైన మార్గంలో మళ్ళీ బొమ్మలు - "దేవాలయ కల్యాణ మండపంలో దేవదాసి నృత్యం", "చెరువు నుండి నీళ్ళు" తడిసిన బట్టల్తో, విరబోసిన కుంత లాలతో, నడుమున నిండు బిందెతో గ్రామీణ స్త్రీ గజగమనం - ఈ రెండు చిత్రాల్లోనూ - సరోజే మోడల్. ఫ్రెంచి ఆర్ట్ మీది సాహిత్య చర్చల పుస్త కాలు మళ్ళీ ముట్టలేదు. మతి చలించి చెవికోసుకొన్న డచ్చి చిత్రకారుడు వాన్‌గో, కళ్ళుబోయి, కుష్ఠు రోగంతో మరణించిన ఫ్రెంచి చిత్రకారుడు పాల్‌గాగిన్ - ఇద్దరికీ కృష్ణా తీరంలో తర్పణాలు వదిలాడు.

* * *

సరోజ నిలబడే ఉంది. తను కాలెండర్ వంక చూస్తున్నాడు - తేదీ తొమ్మిది. ఇవ్వాళనే సరోజను కొత్త బొమ్మ సిటింగ్ కోసం రమ్మన్నాడు. సాగిలపడి దిండుకింద పర్సులో పదిహేను రూపాయలు తీసి ఇచ్చాడు. "మీకు జ్వరంగా ఉంది కదా, మరొకసారి ఇవ్వవచ్చునండీ" - అంది. తను బలవం తంగా ఇచ్చాడు. పోతూ పోతూ ఫ్లాస్క్ తీసుకున్నది. కాఫీ, ఇడ్లీల పార్సెలు తెచ్చింది. వంట గదిలో పాత్రల్ని మాగిపోయిన పదార్థాల కంపునూ శుభ్రం చేసింది. స్టౌలో కిరసనాయిలు పోసింది. తన కూలీ డబ్బులకు తగిన శ్రమ దానం చేసింది. మురికిగుడ్డల్ని లాండ్రీలో వేస్తానని తీసుకెళ్ళింది. కాఫీతాగి మళ్ళీ తను నిద్రపోయాడు. జ్వరం పోయింది గాని అంతరంగ కల్లోల తరంగాలు ఆగలేదు.

* * *

డ్రాయింగ్ మాస్టరు భుజంగరావు. నిజంగా క్రుద్ధ భుజంగం - ఆ స్వరూపం. నల్లగా ఆరడుగుల ఆజానుబాహుడు. చిరునవ్వు లేదు. పలక రింపు లేదు. నేరుగా క్లాసులో నల్ల బల్లను సమీపించే వాడు. సిలబస్ ప్రకారం ఒక బొమ్మ. దాని కిందనే, ఆ బ్లాక్ బోర్డు మీదనే తనకు తోచిన ఇంకోబొమ్మ నిముషాల మీద వేసే వాడు. మొదటి బొమ్మకు - సెక్షన్ల విభజన ఉండేది. చూచి నేర్చుకోవాల్సిందే. తన విశదీకరణ ఏమీ ఉండేది కాదు. ఎందుకో, ఆ చాక్‌పీస్ తెల్ల బొమ్మలే తన నాకర్షించేవి.

తను ధైర్యం చేసి వివరణ అడిగితే - తన పుస్తకం మీదే రెండు ముక్కలు వ్రాసేవాడు.

అనాటమీ, ఫిజియానమీ.

అంతే.

కండరాలు, బొమికెలు, కాళ్ళ వంపులు, జంతువుల మనుషుల కళ్ల వాలు, చూపు, ప్రకృతికీ మానవ జాతికీ గల విచిత్రానుబంధం - అతి సహజంగా అతి కోమలంగా, అతి భయంకరంగా! అదే తన బ్రతుకు ప్రాతిపదిక అయింది. తర్వాత స్వయం కృషి. అతుకుబొతుకులుగా అంతేవాసిత్వం, కొన్నాళ్లు రాజస్థానం, గుజరాత్ సరిహద్దుల్లో-కొన్నాళ్ళు గుండ్లకమ్మ తీరాన. చిత్ర లేఖనంలో ఇది తన చరిత్ర.

కమానుతో ఫిడేలు తీగెలను స్పర్శించి ఎన్ని వారాలయిందో. కలల్ని కట్టిపెట్టి కమాను పట్టాడు. ఏ రాగమో తెలియదు, పార్థసారథి తలపులోకి వచ్చాడు- ఎఫ్.ఎ.కాగానే వాణ్ణి జర్మనీలో ఇంజనీరింగ్ కోర్సుకు వాళ్ళ నాన్నగారు పంపారు. తను బ్రిటిషు ప్రభుత్వంలో ఉద్యోగి అయినా ద్వేషంతోనే ఆ కొలువు చేసిన వాడు క్రిష్ణయ్యంగార్. కొడుకు ఇంగ్లండ్‌లో చదవకూడదు. కాని పార్థుడు జర్మనీలో నాజీ పార్టీ విజృంభణ దశను చూచిన వాడు. స్పెయిన్ అంతర్యుద్ధంలో నరకాసుర నాజీల నవీనాయుధాల విధ్వంసకాండ గూర్చి విన్నాడు. ప్రతి నిత్యమూ యూదులు పడే అవస్థలు చూశాడు.

నాజీలు నరహంతకులు. యుద్ధం ప్రారంభం కాకముందే జర్మనీ నుంచి బయటపడ్డాడు. లండన్ చేరాడు. సైన్య బలమొక్కటే ఫాసిస్టు రాక్షస బలాన్ని రూపు మాపగలది - అని నిర్ణయానికి వచ్చి అక్కడే రాయల్ ఇంజనీర్స్ కోర్‌లో కమిషన్డ్ ఆఫీసరుగా నమోదైనాడు. ఫాసిజం నిజ స్వరూపం గురించి వ్రాసిన జాబుల్తోనే పార్థుడు తనకు కొంత స్ఫూర్తినిచ్చాడు. తన పలుకుబడితోనే పార్థుడు తననూ నడిపించాడు. కమాను కదలక నిలిచింది.

బయట తలుపు చప్పుడు.

పార్థుడి కేబిల్ గ్రాం. ఇటలీలో మిలన్ నగరం నుంచి. "మనిషి వస్తున్నాడు. కొత్త బొమ్మలు పంపు." తన ఘోషను, భౌతిక కల్లోలాల్నీ అధ్యాత్మిక కలవరింతల్నీ తనకు గాక ఇంకెవరికి వ్రాయగలడు! వివేకానందుడి ఉద్ఘాటన - పాశ్చాత్యుడి టెక్నాలజీ, భారతీయుడి ఆత్మ విమర్శ - మిళితం చేసి వేసిన కొత్త బొమ్మలు. "రమణాశ్రమంలో వృక్ష రాశి",

"ఛాయా సాష్టాంగ నమస్కృతి", "నాగపూజ" సరోజతో మొన్న మొన్నటి బొమ్మలు - అన్నీ కలిపి ఎరువుల కర్మాగారం నిర్మాణంలో సలహా లివ్వ వచ్చిన ఇటాలియన్ ఇంజనీర్ ద్వారా పంపేశాడు.

మళ్ళీ అందోళన. ఆర్థికపరమైన చిక్కులు. భాస్కరం, శ్రీనూ బొంబాయి వెళ్ళి పోయారు. సరోజ కూలి పది రూపాయలకు తగ్గించాడు.

ఈ ఆరు నెలలూ ఆరు యుగాలు.

ఆరు కుశంకలు.

ఎందుకీ బొమ్మలు గీయటం?

హరికథల భాగవతార్లకు ఫిడేలు వాయిస్తే కుక్షి నిండదా?

అయినా ఈ వ్యధా భరిత ప్రస్థానానికి అర్థం లేదు గదా! రాత్రంతా సముద్ర పొడ్డునే గడిపాడు.

ఆ రాత్రే హయగ్రీవం అక్కకు జాబు వ్రాశాడు. "నీతో తల్లి రక్తం పంచుకొని పుట్టిన తమ్ముడు నీకేసాయమూ, సంతోషమూ చేయలేని, ఇవ్వలేని అసమర్థుడు. నన్ను క్షమించు."

తండ్రి రూపం స్మృతికి తెచ్చుకొని - "నువ్వు నాకేసంపదా ఇవ్వ లేదని నిందించిన వాడిని. ప్రాణం ఇచ్చావని తెలియని అజ్ఞానిని. "క్షమించవా నాన్నా" - అని ప్రార్థించాడు.

తనే శ్రద్ధతో వేసిన అమ్మ చిత్రాన్ని గోడకు అమర్చి ఏమని వేడాలో తెలియక నిర్విణ్ణుడై పోయాడు.

కలల కాలం, కన్నీళ్ళ కాలం గడచి పోయింది.

ఒక్కటే ప్రశ్న: తన బొమ్మలు, చిత్ర వర్ణాలు తనకైనా తృప్తినీ ఆనందాన్నీ ఇచ్చాయా?

అవును - కాదు - ఏదో ఒక సమాధానం లభిస్తే చివరి నిర్ణయం తీసుకో వచ్చు.

అంతర్వాణి పలకరింపు కోసం వేచి ఉన్నాడు.

పక్కనే నిద్రమాత్రల నిండు సీసా.

న్యాయాధికారి.

ఫైనల్ జడ్జిమెంట్.

తుది తీర్పు. నిరీక్షణ.

ఎదురుగా సరోజ. ఎప్పు డొచ్చిందో.

"భాస్కరం గారూ, శ్రీను గారు వెళ్ళిపోయిం తర్వాత మీరే ఆధారంగా నిలిచారు - ఇంట్లో జరగటం లేదండీ"

"ఏం లాభం? ఈ బొమ్మ లెవర్ని ఉద్ధరించను?" అన్నాడు తను.

అలసి పోయినట్లుగా, చెప్పకుండానే తను మామూలుగా కూర్చొనే చోట కుర్చీలో కూలబడి ముఖం తుడుచుకొన్నది.

"అట్లా అంటా రేమిటండి. వాళ్ళిద్దరి కన్నా మీ బొమ్మలు ఎంత బాగుంటాయండి - ఎంతో చెప్పలేను. ప్రాణం పోస్తారు."

ఆమెను నిర్వికారంగా చూచాడు. ఆ కళ్ళల్లో నిండుగా నిజాయితీ, నిబద్ధత.

"నిజంగానా?"

"అయ్యో, అబద్ధం చెబుతానాండీ" అన్నది.

"అయితే అట్లాగే కూచో" - హయగ్రీవం తన ఫిడేలును ఆమె కిచ్చాడు. కమాను చేతి కందించాడు. గడ్డంతో ఫిడేలు అంచు నొక్కి పట్టమన్నాడు. గబగబా ఈజెల్ మీద కొత్త కాన్వాసు పరిచి క్లిప్పులు పెట్టాడు. రంగుల పళ్ళెం తీసుకొని కుంచెతో నన్నని గీతలు గీశాడు.

బయట తలుపు చప్పుడు.

"ఓవర్సీస్ కే బిల్ గ్రాం" అరుపు.

"గ్రీవ్, గ్రీవ్. నీ జెండా ఆకాశ తలంలో ఎగురుతున్నది. నీ చిత్రా లన్నీ కొనేశారు. త్రీ థౌజెండ్ పౌండ్స్. మూడు వేల స్టెర్లింగ్. 'బ్యాంక్ ద్వారా పంపాను-సారో."

హయగ్రీవం ఎగిరి గంతేశాడు.

'సరోజా! సరోజా!'

ఆమె నుండి సమాధానం లేదు.

సరోజ చేతిలో ఫిడేలు జారి నేల మీద పడ్డది.

కమా నింకా చేతిలోనే ఉన్నది.

శరీరం ఒరిగి కుర్చీ నుంచి సోఫా మీద వాలిపోతున్నది.

"సరోజా! సరోజా!"

నీళ్ళు తెచ్చి ముఖాన చిలకరించాడు.

వీపుమీద తేలిన వాతలు పమిట తొలిగి కన్పిస్తున్నాయ్.

"నీ బొమ్మలన్నీ అమ్ముడుపోయాయ్ సరోజా! నువ్వు అబద్ధం చెప్పలేదు. సరోజా! నీళ్ళు – నీళ్ళు తాగు."

సరోజ కళ్ళు తెరిచి చూస్తూ, చిరు నవ్వు అధరాల చివర్లన అలము కుంటూంటే మెల్లిగా అన్నది.

"అన్నం తిని మూడు రోజు లైంది."

సరోజను బతికించాలి.

హయగ్రీవం మెట్లు దూకుతూ కిందికి పోయాడు.

కాఫీకో, కొబ్బరి నీళ్ళకో.

బతుకంటే అర్థం చెప్పిన మానవికి.

ఇదా చిత్ర లేఖనం అంటే. ○

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 3 జూన్ 1992)